


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :306 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 2 అక్టోబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ



- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

**న్యూఢిల్లీ:**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం మిగతా 2లో...

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!
- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



**హైదరాబాద్ సింధూరదర్శిని:**
తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని మిగతా 2లో...



## బీసీలకు అండగా నిలిచింది...

# నిలిచేది మేమే

- 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్ - రిజర్వేషన్లు అడ్డుకునేలా కోర్టుల్లో గొడ్డలి పార్టీ పిటీషన్లు
- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రేపు శ్రీకారం
- సంక్షేమం-అభివృద్ధి- సుపరిపాలనతో ప్రతిచోటా ఫలితాలు - రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం

**రేపల్లె సింధూరదర్శిని:**
బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజా వేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. మిగతా 2లో...

## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..

- 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం




**అమరావతి సింధూరదర్శిని:**
ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు మిగతా 2లో...

## ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ అస్తమయం

- ఏపీకి తీరని లోటన్న సీఎం చంద్రబాబు
- వన్‌నెస్ ఉద్యమ వ్యవస్థాపకుడు శ్రీ గురు కల్కి భగవాన్ కన్నుమూత
- ఆయన మృతి పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- తిరుపతి ప్రాంతం, వరదయ్యపాలెం కేంద్రంగా ఆయన సేవలు చిరస్మరణీయం
- కల్కి కుమారుడు శ్రీ కృష్ణాజీ, కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి

**అమరావతి సింధూరదర్శిని:**



వన్‌నెస్ ఉద్యమ వ్యవస్థాపకుడు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ గురు కల్కి భగవాన్ జీ అస్తమయం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రేమ, కరుణ, ఆధ్యాత్మిక చైతన్యం వంటి మానవతా విలువలను వ్యాప్తి చేసేందుకు కల్కి భగవాన్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన మరణం రాష్ట్రానికి, యావత్ ఆధ్యాత్మిక ప్రపంచానికి తీరని లోటని అన్నారు. ఈ మేరకు చంద్రబాబు గురువారం సోషల్ మిగతా 2లో...

## బీసీల 34 శాతం రాజకీయ హక్కు కోసం చివరి వరకూ పోరాడతాం

- హైకోర్టు తీర్పు బాధాకరం.. సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- జగన్ ప్రభుత్వ హయాంలోనే బీసీ రిజర్వేషన్ 34% నుంచి 24.15%కు పరిమితమైంది
- బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి చట్టబద్ధ పునాది వేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీది
- న్యాయపోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు
- అవసరమైతే పార్టీ తరపునే బీసీలకు 34% రాజకీయ అవకాశాలు కల్పిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి సింధూరదర్శిని:**
స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి జీవోలను హైకోర్టు కొట్టివేయడం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుతో బీసీల రాజకీయ హక్కుల కోసం చేస్తున్న పోరాటం ఆగిపోదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 34శాతం బీసీ రిజర్వేషన్ కోసం న్యాయపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటుందని, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. బీసీల రాజకీయ సాధికారత విషయంలో తెలుగుదేశం పార్టీ చరిత్ర



ఎవ్వరూ చెరిపేయలేరని అచ్చెన్నాయుడు అన్నారు. 1987 చట్టసవరణల ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 20శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత మిగతా 2లో...

# డైట్ చార్జీల పెంపు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత - అక్టోబర్ 1 నుంచే ఛార్జీల పెంపు
- నూతన మెనూ అమలు చేస్తూ ఉత్తర్వులు - ఆరు రోజులు గుడ్లు, మూడ్రోజులు చికెన్
- పౌష్టికాహారంతో బీసీ విద్యార్థులకు ఆరోగ్యం : మంత్రి సవిత
- డైట్ ఛార్జీల పెంచినందుకు మంత్రి సవిత హర్షం-సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

**అమరావతి సింధూరదర్శిని:**
బీసీ హాస్టళ్లు, గురుకులాల డైట్ ఛార్జీలు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. పెంచిన డైట్ ఛార్జీలతో మరింత నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడానికి వీలుకలుగుతుందన్నారు. పెరిగిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా మెనూలో మార్పులు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి సవిత గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెరిగిన ధరల నేపథ్యంతో పాటు విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేలా కూటమి ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. పెంచిన డైట్ ఛార్జీలు గురువారం నుంచే అమల్లోకి రానున్నట్లు తెలిపారు. 3 నుంచి 6



తరగతి విద్యార్థుల డైట్ రూ.1,150ల నుంచి 1,265కు పెంచారన్నారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,400ల నుంచి రూ.1,600లకు, ఇంటర్, ఆపై తరగతి విద్యార్థులకు రూ.1,600ల నుంచి మిగతా 2లో...

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. “1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన ‘ఉక్కు చట్రాన్ని’ (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ అస్తమయం

(మొదటిపేజీ తరువాయి)

మీడియా వేదికగా స్పందించారు. “భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాలను తన బోధనలతో ప్రభావితం చేసిన మహనీయుడు కల్కి భగవాన్. ముఖ్యంగా తిరుపతి ప్రాంతం, వరదయ్యపాలెం కేంద్రంగా ఆయన అందించిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయం. ఆయన మరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసింది" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. కల్కి భగవాన్ ఆకస్మిక మరణం ఆంధ్రప్రదేశ్‌కు, ఆయన బోధనల నుంచి స్ఫూర్తి పొందిన ప్రతి ఒక్కరికీ గొప్ప నష్టమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కల్కి భగవాన్ కుమారుడు శ్రీకృష్ణాజీకి, వారి కుటుంబ సభ్యులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెంలో కల్కి భగవాన్ ‘వన్‌నెస్’ ఉద్యమాన్ని స్థాపించారు. ఇక్కడి ఏకం గ్లోబల్ టెంపుల్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన భక్తులకు ఒక ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. తన బోధనల ద్వారా అంతర్గత శాంతి, మానవ సంబంధాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఆయన ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందారు. ఆయన మరణంతో ఆధ్యాత్మిక రంగంలో ఒక శూన్యత ఏర్పడిందని పలువురు ప్రముఖులు, అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.-

## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ‘సర్’ ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## డైట్ చార్జీల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

1,800లకు పెంచారన్నారు.

**ఆరు రోజులు గుడ్లు... మూడ్రోజులు చికెన్**

పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కొత్త మెనూ ప్రకారం వారంలో ఆరు రోజులు గుడ్లు, మూడ్రోజులు చికెన్, రోజూ పాలు, పండ్లు అందజేయాలని ఉత్తర్వులు పేర్కొన్నారు. చిరుధాన్యాలతో చిక్కీలు, రాగి లడ్డూలు, పప్పులు, ఆకు, ఇతర కూరగాయలలో సమతుల్య ఆహారం అందించనున్నామన్నారు. విద్యార్థులను నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**

బీసీ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెంచుకుని డైట్ ఛార్జీలు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో సొంతింటిని మరిపించేలా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో బీసీ విద్యార్థులు రాబోయే టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలని మంత్రి సవిత కోరారు.

# బీసీలకు అండగా నిలిచింది... నిలిచేది మేమే

(మొదటిపేజీ తరువాయి)

తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ..” ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే.” అని ముఖ్యమంత్రి అన్నారు.

### జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం

“గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీభూమి- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటు న్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకు వస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్నున్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్‌తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### సంపద సృష్టికి మూలధన వ్యయం పెంచాం

“రాష్ట్రవ్యాప్తంగా విశాఖ, విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాల్లో నివాసస్థలాల్లో పేదలకు పట్టాలు ఇచ్చాం. రూ.52 వేల కోట్ల విలువైన నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాం. పేదల కుటుంబాలకు చేయుతను ఇచ్చే అంశాన్ని ఆర్థిక కోణంలో చూడటం లేదు. పేద కుటుంబాల్లో 3-4 పథకాల ద్వారా ఆర్థిక సహకారం చేయూత అందుతోంది. స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం, మత్స్యకార సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో ఇలా వేర్వేరు పథకాలు అందుతున్నాయి. రాష్ట్రంలో ప్రతీ వర్గాన్ని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 1 లక్ష మంది డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాం. మరో 5 లక్షల మందిని కూడా వ్యాపారవేత్తలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ నెలా డబ్బులు ఇచ్చేసి వెళ్లడానికి రాలేదు. ప్రజలను కలిసి వారి బాగోగులు తెలుసుకోడానికి వస్తున్నాను. అట్టడుగుస్థాయి వ్యక్తికి ఆర్థిక స్థోమత ఇచ్చి జీవన ప్రమాణాలు పెంచినప్పుడే అభివృద్ధి అదే నా సిద్ధాంతం. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా చేపడుతున్నాం. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11వేల కోట్ల పనులు చేపడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గోతులు తవ్వేశారు. గడచిన రెండేళ్లుగా వాటిని పూడ్చి రోడ్లు బాగు చేశాం. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతీ పౌరుడి ఆరోగ్య రికార్డులను డిజిటల్‌గా పర్యవేక్షిస్తాం. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటం ద్వారా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల మందికి ఉద్యోగాలు గడచిన రెండేళ్లలో వచ్చాయి. సంపద సృష్టించేలా క్యాపిటల్ ఎక్స్ పెండిచర్ పెంచాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు పూర్తి చేస్తున్నాం. రాయలసీమ జీవనాడి హంద్రినీవా మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. వంద రోజుల్లో రూ.3,500 కోట్లు ఖర్చు చేసి చిట్టచివరి ప్రాంతమైన కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసి మార్కాపురం వరకూ నీళ్లు తీసుకువచ్చాం. శ్రీశైలం మల్లన్న పాదాల నుంచి మార్కాపురం చెన్నకేశవ స్వామి చెంతకు కృష్ణమ్మ నీళ్లు తీసుకెళ్లాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి నీళ్లు తీసుకువెళ్లాం. ఎల్ నినో కారణంగా వర్షాలు పడక రాష్ట్రంలో కరవు వచ్చింది. డ్రామాలు ఆడటానికి గొడ్డలి పార్టీ బయల్దేరింది. వరుణ దేవుడి కృపవల్ల మనకు సరైన సమయంలో కాస్త వర్షాలు పడ్డాయి. కృష్ణానదిలో నీళ్లు రాకపోయినా గోదావరి నీళ్లు పట్టిసీమ ద్వారా డెల్టాకు తెచ్చాం. గతంలో కేవలం 13 నెలల్లోనే పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లు తెచ్చాం.పోలవరం పూర్తి అయితే కృష్ణా, గోదావరి డెల్టాలకూ నీటి సమస్యే ఉండదు. పట్టిసీమ అనే నిర్ణయం ఇక్కడి రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చింది. గొడ్డలి పార్టీ విమర్శలకు భయపడితే కృష్ణాడెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. ప్రతిపక్ష పార్టీ అంటే పోటీ తత్వం ఉండాలి. కాని గొడ్డలి పార్టీకి కుట్రతత్వం ఉంది.అభివృద్ధికి ఆటంకాలు కలిగించటమే గొడ్డలి పార్టీ పని” అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

### పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక

“వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్‌హబ్‌గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి.బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్ధే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచికులు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందిం చేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగ పడుతు న్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను.” అని సీఎం సూచించారు.

### అభివృద్ధి అంశంలో రాజీలేదు

“గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందిస్న?న్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

# బీసీల 34 శాతం రాజకీయ హక్కు కోసం చివరి వరకూ పోరాడతాం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించింది తెలుగుదేశం పార్టీనే, 1995లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో బీసీలకు 34 శాతానికి తగ్గకుండా రాజకీయ రిజర్వేషన్ కల్పించే నిబంధన తీసుకొచ్చింది కూడా తెదేపానే అని గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ అవకాశాలు ఇవ్వడం తెలుగుదేశం పార్టీకి కొత్త కాదు. బీసీలకు 20 శాతం రాజకీయ రిజర్వేషన్ నుంచి 34 శాతం వరకు హక్కు కల్పించిన చరిత్ర మాది. బీసీలను అధికారంలో భాగస్వాములను చేయాలన్నది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అని మంత్రి పేర్కొన్నారు.

**జగన్ హయాంలోనే 34% నుంచి 24.15%కు తగ్గింది**

2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌తో కలిపి మొత్తం రిజర్వేషన్లు 59.85 శాతానికి చేరాయని, దీనిని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో 2020 మార్చి 2న హైకోర్టు 50 శాతం పరిమితిని ప్రస్తావిస్తూ తన మనుషులచే సరైన న్యాయపరమైన ప్రక్రియ పాటించకపోవడం వల్లే బీసీల 34 శాతం రాజకీయ రిజర్వేషన్ 24.15 శాతానికి పరిమితమైంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రయత్నిస్తుంటే ఆయన సామాజిక వర్గానికి చెందిన వారితో వరుస కోర్టు కేసులతో అడ్డంకులు సృష్టించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే ముందు ఆ ఐదేళ్లలో బీసీల రాజకీయ హక్కులను ఎందుకు తిరిగి సాధించలేకపోయారో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలి అని మంత్రి వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల రాజకీయ వెనుకబాటుతనం, ప్రాతినిధ్యంపై అధ్యయనం కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ ద్వారా అధ్యయనం చేపట్టిందని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన వాదనల్లో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో బీసీల జనాభా సుమారు 50.42 శాతంగా నమోదైందని, డెడికేటెడ్ కమిషన్ అధ్యయనాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నామని తెలిపిందన్నారు. అనంతరం గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న మా సంకల్పంలో ఎలాంటి మార్పు లేదు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీల హక్కుల కోసం సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తాం. అవసరమైన అన్ని రాజ్యాంగ, న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తాం. ఒక్క అడుగు కూడా వెనక్కి వేయం అని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

న్యాయపరమైన అన్ని అవకాశాలను వినియోగించిన తర్వాత కూడా స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు అవరోధాలు ఎదురైతే, తెలుగుదేశం పార్టీ తరఫున స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రాజకీయ అవకాశాలు కల్పించేలా ముందుకు వెళ్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు

విజయవాడ, సింధూరదర్శిని:బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలుగుదేశం, వైసీపీ నాటకాలాడుతున్నాయని, ఓట్ల కోసం బీసీలను మోసం చేస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై విజయసాయి రెడ్డి స్పందిస్తూ... రెండు పార్టీలు ఇదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. “చట్టపరంగా నిలబడవని తెలిసి కూడా రిజర్వేషన్లు 50 శాతం



పరిమితిని దాటేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా వెనువెంటనే కోర్టుల్లో కేసులు వేయించడం వీరికి పరిపాటిగా మారింది” అని ఆయన ఆరోపించారు. ఈ విధంగా బీసీలను మభ్యపెట్టి, కోర్టు తీర్పులు రాగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.



## మినీ గురుకుల పాఠశాలలో యస్ యమ్ సి ఎన్నికలు

గూడూరు( సింధూర దర్శిని) 1 అక్టోబర్ నెల్లూరుజిల్లా; రెండవ పట్టణంలోని మినీ గురుకులం పాఠశాల నందు 2026-27 సంవత్సరానికి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు మినీ గురుకులం పాఠశాల డోనార్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ హాజరయ్యారు. సభాధ్యక్షురాలిగా మరియు ఎన్నికల నిర్వహణాధికారిగా పాఠశాల హెడ్మాస్టర్ కె.వి. రజిని కుమారి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ చిల్లకూరు శిరీష, వైస్ చైర్మన్ యాకసిరి సుమతి, వీరితో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లను పాఠశాల హెడ్మాస్టర్ కె.వి. రజిని కుమారి మరియు పాఠశాల డోనార్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, లలిత, పద్మావతి, చంద్ర, నాగూరమ్మ, అంకమ్మ, వనమ్మ, కల్పన, రమణమ్మ, రాజేశ్వరమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం ఎస్ సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి ఘన విజయం

శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీ కోదండ రామస్వామి

ఆలయ చైర్మన్ కోటా సతీష్ యాదవ్



గూడూరు (సింధూరదర్శిని) 1అక్టోబర్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని తమ్మినపట్నం పంచాయతీ గుమ్మలదిబ్బ గ్రామం నందు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఎంఎస్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి వైలంగారి రోశయ్య గ అత్యధిక మెజారిటీ ఓట్లతో సాధించి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్ గా టీడీపీ అభ్యర్థి ఎస్కే అబుసాలియా ఎన్నికయ్యారు. అలాగే ఈ కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ బాలాజీ, పవన్, పాఠశాల సిబ్బంధి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు భక్తని రామయ్య , కొండూరు సురేష్, కొండూరు సుమలత తదితరులు పాల్గోనారు. ఛైర్మన్ మరియు వైస్ ఛైర్మన్ ఎన్నికైన అభ్యర్థులకు శ్రీ కోదండ రామస్వామి ఆలయ చైర్మన్ కోట సతీష్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అత్యంత వైభవంగా పూలంగి సేవ



కాణిపాకం(సింధూరదర్శిని)1 అక్టోబర్ చిత్తూరుజిల్లా;- కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పూలంగి సేవ అత్యంత వైభవంగా ఆలయంలోని కళ్యాణ వేదిక నందు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడులను సమర్పించిన నిడదవోలు వాసులు



కాణిపాకం (సింధూర దర్శిని) 1 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు చెందిన సత్యనారాయణ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో వారి బృందం సుమారు 55 మంది గణేష్ దీక్ష మాలాధారణ భక్తులు ఇరుములను చెల్లించడానికి కాణిపాకం స్వామివారి దర్శనానికి విచ్చేయడం జరిగింది, వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాటు చేసి గణేష్ దీక్ష మండపం నందు ఇరుములను సమర్పించారు.



# అట్టహాసంగా శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవము

అమ్మవారికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలను సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి

రాష్ట్ర పండుగగా వైభవంగా పోలేరమ్మ జాతర

జాతర నిర్వహణకు రూ.50 లక్షలు - తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల

ఆలయ ఖాతాలో రూ.1.70 కోట్ల ఎఫ్‌డీ, రూ.25 లక్షలు జమ

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

వెంకటగిరి (సింధూరదర్శిని) 1అక్టోబర్ తిరుపతి జిల్లా; శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వ లాంఛనాలతో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వెంకటగిరి శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో జాతర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, శ్రీశ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రముఖ ఆలయాల ఉత్సవాలను రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తున్నామని, వాటి నిర్వహణకు దేవాదాయ శాఖ తరఫున ప్రతి పండుగకు ఏటా రూ.50 లక్షల వరకు నిధులు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా పోలేరమ్మ జాతరకు ఈ ఏడాది రూ.50 లక్షలు మంజూరు చేసి, తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. ఆలయ ఖాతాలు, ఖర్చుల వివరాలు సమర్పించిన అనంతరం మిగిలిన రూ.10 లక్షలు విడుదల చేస్తామని వెల్లడించారు. శ్రీ పోలేరమ్మ ఆలయానికి భక్తులు, దాతల సహకారంతో బంగారు కిరీటం, పాదాలు, హస్తాలు, స్వర్ణహారాలు తదితర ఆభరణాలు సమకూరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయానికి రూ.1.70 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంచడంతో పాటు, ఎస్బీఐ ఖాతాలో రూ.25 లక్షలు జమ చేసినట్లు చెప్పారు. కొలితోట ప్రాంతానికి సంబంధించిన నిధులను కూడా భద్రపరుస్తామని, అవసరమైన సమయంలో ప్రభుత్వ అనుమతులతో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఆలయ నిధులు సక్రమంగా వినియోగించేలా పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కింద ఏటా రూ.4.80 లక్షలు, మూడు ఆలయాల అభివృద్ధికి రూ.7.05 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 13 ఆలయాల నిర్మాణానికి రూ.4.60 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వెంకటగిరి నియోజక







వర్గంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో అక్కడ మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రాపూరు మండలంలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దత్తత ఆలయంగా అనుసంధానం చేయడం ద్వారా చెంచులక్ష్మి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. జాతర అనంతరం జిల్లా కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కొలితోట ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడతామని తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర అభివృద్ధి, అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్యూ లైన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తులు ఎండలో ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా, క్రమపద్ధతిలో దర్శనం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. క్యూ లైన్లలో భక్తులు గంటకు పైగా వేచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించి అధికారులకు సహకరించాలని, భక్తుల దర్శనానికి ప్రాధాన్యతనిస్తూ క్యూ లైన్లను సక్రమంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమన్నారు. భక్తుల రద్దీ, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అన్ని శాఖలతో సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తులు అధికారుల సూచనలు పాటించి క్రమపద్ధతిలో దర్శనం చేసుకుని జాతరను విజయవంతం చేయడానికి సహకరించాలి అని కోరారు. జాతరను సమర్థవంతంగా నిర్వహించేందుకు నిరంతరం విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ల నాయకత్వంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, వైద్యారోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని నియంత్రించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు, మీడియా ప్రతినిధులకు అందరికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమీషనర్ మహేశ్వర రెడ్డి, శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ దేవస్థానం ప్రత్యేక అధికారి విజయ రాజు, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీఓ బానుప్రకాష్ రెడ్డి, ఆలయ చైర్మన్ మురళి కృష్ణ, వెంకటగిరి తహసీల్దార్. శిరీష, ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్. కె.ఆర్ లో గాంధీ జయంతి వేడుకలు

గూడూరు( సింధూరదర్శిని) 1 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని ఎస్. కె.ఆర్ ప్రభుత్వ పాఠశాల నందు గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అహింస, సత్య గ్రహం, మానవ సేవే అనే మూడు అంశాలను ఆయుధంగా చేసుకొని శత్రువులను హింస మార్గంలో కాకుండా అహింస మార్గంలో గెలవాలని కోరారు. హింస మానవజాతి నీ సర్వ నాశనం చేస్తుందన్నారు. గాంధీజీ సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకో వాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్రుత్వపు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమం లో ఐ.క్యూ.సి. కో ఆర్డినేటర్ యశోదా, లావణ్య, సురేంద్ర , రమణా రెడ్డి, వాసంతి , తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి అండగా ప్రభుత్వం

**కుటుంబ కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని స్పందించిన మంత్రి నారా లోకేష్**

**మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**బాలుడికి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం.. పాపకు గుండె ఆపరేషన్‌కు చర్యలు**

**కుటుంబానికి ఇంటి స్థలం.. తండ్రికి వైద్యం.. తల్లికి స్వయం సహాయక సంఘం ద్వారా ఆర్థిక చేయూత**



నెల్లూరు( సింధూర దర్శిని) 1 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించారు. కుటుంబ పరిస్థితులను పరిశీలించి అవసరమైన సహాయం అందించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారు. వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన ఇస్తేరమ్మ, ఆశీర్వాదం చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఇటీవల తమ బిడ్డలతో నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో పడుతున్న కష్టాలు సోషల్ మీడియాలో పబ్లిష్ కి అయ్యాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టి ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా నిలిచింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న పరిస్థితిని తెలుసుకున్న మంత్రి నారా లోకేష్, పిల్లల భవిష్యత్తు, కుటుంబ ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. బాలుడి పరిస్థితిపై కూడా మంత్రి స్పందించి, బాలుడిని సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి చదువుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి కుటుంబానికి అవసరమైన చర్యలను ప్రారంభించారు. బాలుడు పురుష రామయ్య, వయస్సు 10 సంవత్సరాలు, ఎస్టీ ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన బాలుడు. దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో గుర్తించబడిన ఈ బాలుడిని నెల్లూరులోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో చేర్పించి, వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పీడీ ఐసీడీఎస్ అధికారులు రామయ్యను తమ ఆధీనంలోకి తీసుకుని, ప్రస్తుతం నెల్లూరుకు తీసుకువస్తున్నారు. అదేవిధంగా కుటుంబంలోని పాపకు గుండె సంబంధిత సమస్యకు అవసరమైన ఆపరేషన్ చేయించేందుకు వైద్యపరమైన చర్యలు చేపట్టారు. అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సను ప్రభుత్వపరంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం అందించేందుకు చర్యలు చేపట్టారు. కుటుంబ పెద్ద అయిన తండ్రికి అవసరమైన వైద్య చికిత్స అందించేందుకు సంబంధిత శాఖల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తల్లిని స్వయం సహాయక సంఘాల నెట్‌వర్క్‌లో భాగస్వామ్యం చేసి, ఆర్థికంగా చేయూత అందించేందుకు చర్యలు చేపట్టారు. కుటుంబానికి అర్హత మేరకు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పేదరికం కారణంగా పిల్లలు విద్యకు, వైద్య సదుపాయాలకు దూరం కాకుండా వారికి అవసరమైన ప్రభుత్వ సహాయం అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మంత్రి నారా లోకేష్ స్పందనతో, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తక్షణ చర్యలతో ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం భరోసాగా నిలిచింది.

# పొర్లుకట్టలో పండుగలా పెన్షన్ల పంపిణీ

**అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ అందించిన మంత్రి నారాయణ**

**సచివాలయంలో ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది పనితీరుపై ఆరా**

**రాష్ట్రంలో ప్రతి నెలా పండుగ వాతావరణంలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ**



నెల్లూరు (సింధూర దర్శిని) 1 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు సిటీ నియోజకవర్గం పొర్లుకట్టలో గురువారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదును అందించారు. మంత్రే తమ ఇంటికి వచ్చి పెన్షన్ అందించడంతో అవ్వాతాతలు, వృద్ధులు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబరు నెలలో రాష్ట్రవ్యాప్తంగా 61,80,448 మంది లబ్ధిదారులకు రూ. 2,692 కోట్లతో పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పెన్షన్ల కోసం రూ. 76 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఏడాదికి సుమారు రూ. 33 వేల కోట్లు సామాజిక భద్రతా పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు బాధ్యతతో ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. సామాజిక పెన్షన్ల పంపిణీ సందర్భంగా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం

పెన్షన్ల పెంపులో వాయిదా పద్ధతిని అవలంబించిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి పెన్షన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచిందన్నారు. మూడు నెలల పెంపు మొత్తాన్ని కూడా కలిపి అందిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేశారని చెప్పారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బలహీన వర్గాలకు పెన్షన్లను ఒకేసారి పెంచి వారి జీవితాల్లో భరోసా కల్పించామని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్లను రూ. 6 వేలకు, పూర్తి వికలాంగుల పెన్షన్లను రూ. 15 వేలకు, కిడ్నీ, కాలేయం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ. 10 వేలుగా పెంచి అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా పెన్షన్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

**సచివాలయంలో ఆకస్మిక తనిఖీ**

పెన్షన్ల పంపిణీ అనంతరం మంత్రి నారాయణ 48వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, కార్పొరేషన్ ఎస్ఈ జానీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ రామకృష్ణ, డివిజన్ టీడీపీ నాయకులు ధర్మవరపు సుబ్బారావు, ఇంతియాజ్, పెంచలబాబు, జాఫర్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

**థీమ్‌తో రక్తదానంపై అవగాహన**

తిరుపతి (సింధూర దర్శిని) 1 అక్టోబర్ తిరుపతి జిల్లా ; జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర రామనారాయణ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మోడల్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వన్ డ్రాప్ ఆఫ్ హ్యూమానిటీ గివ్ బ్లడ్ సేవ్ లైవ్స్ అనే సందేశంతో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత కలిగిన ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అండగా నిలవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. మనోహర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డా. బి. మనోహర్ మాట్లాడుతూ, తలసేమియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరమవుతుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, క్యాన్సర్, డెంగ్యూ తదితర వైద్య పరిస్థితుల్లో రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఆరోగ్యవంతులైన స్వచ్ఛంద రక్తదాతలే రక్తానికి ప్రధాన ఆధారమని తెలిపారు. ఒక యూనిట్ రక్తాన్ని శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి ప్యాక్డ్ రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, క్రయోప్రెసిపిటేట్ వంటి రక్త భాగాలుగా విభజించి అవసరమైన రోగులకు అందించవచ్చని వివరించారు. రక్తదాతల నుంచి సేకరించిన రక్తానికి బ్లడ్ గ్రూప్ నిర్ధారణతో పాటు హెచ్ఐవి హెపటైటిస్- బి , హెపటైటిస్- సి, సిఫిలిస్, మలేరియా తదితర అంటువ్యాధులకు సంబంధించిన నిర్దేశిత పరీక్షలు నిర్వహించిన అనంతరం సురక్షితమైన రక్తాన్ని మాత్రమే రోగులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్ పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలను అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించడంలో సహకరించిన ప్రతినిధులను అభినందించి, వారికి ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా డా. వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ, రక్తదానం ఒక గొప్ప సామాజిక సేవ అని, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండటం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. యువత, విద్యార్థులు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రక్త కేంద్రాల్లో తగినంత రక్త నిల్వలు ఉండేందుకు మరిన్ని స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కోరారు.

## అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

**ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ**

**ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్న సంక్షేమ కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు( సింధూర దర్శిని) 1 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. గురువారం నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్లో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, లబ్ధిదారుల నివాసాల వద్దకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా బెడ్ రిడెన్ పింఛన్ కింద సాత్విక్ కు రూ. 15,000/-ను జిల్లా కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ లబ్ధిదారులతో ముచ్చటించి వారి కుటుంబ పరిస్థితులు, అవసరాలను తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసి, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పింఛన్ పథకాలను సమర్థ వంతంగా అమలు చేస్తోందని, ఈ పథకాలు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హుల జీవనోపాధికి ఆసరాగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హిమబిందు, సచివాలయ సిబ్బంది, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## నక్కలదిన్నె పిహెచ్ సిలో బాలికలకు టీకాల కార్యక్రమం

చాపాడు (సింధూర దర్శిని) 1 అక్టోబర్ కడప జిల్లా; చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పి ఓబులేసు, డాక్టర్ పి కావ్య మాధురి ఆధ్వర్యంలో 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ లో" హెచ్ పి వి టీకా " కీలకమని నక్కలదిన్నె వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు. గురువారం నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొదటి సారి ఈ కార్యక్రమం నిర్వహించారని ఆయన తెలిపారు. బాలికల ఆరోగ్య రక్షణకు టీకా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని బాలికల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ ఓబులేసు తెలియజేశారు. బాలికలకు గర్భాశయ ముఖ

**హెచ్ పి వి వ్యాక్సిన్ తో క్యాన్సర్ కు అడ్డుకట్ట**

క్యాన్సర్ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా టీకా మందును అందిస్తున్నారు. ఈనెల 7 (ఏడవ) తేదీ వరకు హెచ్ పి వి వ్యాక్సిన్ ఉచితంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వేస్తున్నారని , టీకాలు వేయించుకున్న ప్రతి బాలికకు టీకా వేసుకున్నట్లు సర్టిఫికెట్ అందచేశామని డాక్టర్ తెలిపారు. అనంతరం మహిళా వైద్యురాలు డాక్టర్ కావ్య మాధురి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తుందని, అర్హత గల పిల్లల తల్లిదండ్రులు ప్రోత్సాహించి తప్పకుండా వ్యాక్సిన్ వేయించిగర్భాశయ ముఖ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. అన్నారు. ఈ వ్యాక్సిన్ వలన కలిగే ప్రయోజనాలను బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న గురువలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అయ్యవారి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 31 మంది బాలికలకు హెచ్ పివి టీకాలు వేసినట్లు డాక్టర్ పి ఓబులేసు తెలియజేశారు.




ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య, డిప్యూటి హెచ్ ఈ ఓ జయ ప్రకాశ్,సూపర్ వైజర్ విద్యార్థులు పాల్గొన్నారు.



# బొమ్మిరెడ్డి అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ గూడూరు ప్రజలకు అంకితం

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు ( సింధూర దర్శిని) 1 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; చెన్నైకు చెందిన ఆలయన్స్ గ్రూపు వారి దాతృత్వంతో సి ఎస్ ఆర్ గ్రాంట్ ద్వారా రోటరీ ఫౌండేషన్ వారి సహకారంతో రోటరీ క్లబ్ గూడూరు వారి ఆధ్వర్యంలో విజయవాడ రోటరీ క్లబ్ మిడ్ టౌన్ వారి భాగస్వామ్యంతో గూడూరు కు చెందిన బొసారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారి నిర్వహణతో 43 లక్షల విలువ చేసే బొమ్మిరెడ్డి అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ని గూడూరు ప్రజలకు గురువారం శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ద్వారా అంకితం చేశారు.ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన రోటరీ క్లబ్ అధ్యక్షులు తిరుమూరు సురేష్ రెడ్డి మాట్లాడుతూ, నేను ప్రెసిడెంట్ గా ఉన్న ఈ కాలంలో ఇంత పెద్ద ప్రాజెక్టును మాకు అందించినందుకు స్పాన్సర్ అయినటువంటి అలయన్స్ గ్రూపుకు మా క్లబ్ సభ్యులు పీడీజి బొమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన శాసనసభ్యులు సునీల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు అభివృద్ధిలో బొమ్మిరెడ్డి సోదరుల పాత్ర ఎంతో ఉందని, 1995లో నేను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న కాలంలో జన్మభూమి పథకం ద్వారా గూడూరు లో వేసినటువంటి సిసి రోడ్లలో వారి కాంట్రిబ్యూషన్ ఉందని తెలిపారు. ఈ అంబులెన్స్ ఎంతో ఆధునిక సౌకర్యాలతో ఉందని ప్రాణాపాయంలో ఉన్నటువంటి ఎంతో మందికి, ముఖ్యంగా నానియోజకవర్గ ప్రజలకు ఈఅంబులెన్స్ ఉపయోగపడు తున్న కారణంగా నాకెంతో ఆనందంగా ఉంది అన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ గ్రూపు పార్టనర్ మరియు ఆర్ ఆర్ ఎఫ్ సి జోన్-7 పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ మాకు సంబంధించిన అలయన్స్ గ్రూపు ద్వారా సి ఎస్ ఆర్ ఫండ్స్‌లో నుంచి రోటరీ క్లబ్ గూడూరు మరియు బుసారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 43 లక్షల రూపాయల విలువ చేసే అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ని గూడూరు ప్రజలకు అంకితం చేసామని అన్నారు. ఈ ప్రాజెక్టు అమలు చేసేందుకు రోటరీ క్లబ్ విజయవాడ మిడ్‌టౌన్ వారి సహకారం మరి ముఖ్యంగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వి సుబ్బారావు సహకారం మరువలేనిది అని అన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ గ్రూపు వారికి నంబూరు మనోజ్ కి, మా సోదరులు బొమ్మి రెడ్డి సురేష్ రెడ్డి, సునీల్ రెడ్డి కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసినటువంటి విజయవాడ రోటరీ క్లబ్ మిడ్ టౌన్ ప్రతినిధి రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మరియు ఏ ఈ మెగా జోన్- 7 ఆర్ వి సుబ్బారావు మాట్లాడుతూ, ఇంత అడ్వాన్సుడ్ ఎక్విప్మెంట్తో అంబులెన్స్‌ని ఈ గూడూరు ప్రజలకు అందించడంలో, బొమ్మి రెడ్డి కుటుంబానికి గూడూరు పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టులో మమ్ములను భాగస్వాములను చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొణిదల ముని గిరీష్, బుసారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బుసారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సి జనార్ధన్ రెడ్డి, బి దశరథరామిరెడ్డి, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ ఎన్ బాలకృష్ణం రాజు, చంద్రశేఖర్ రెడ్డి ఇంకా అనేకమంది రొటేరియన్లు పాల్గొన్నారు.అనంతరం గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా అంబులెన్స్ ను రోటరీ ఫ్లాగ్ ఊపి ప్రారంభించారు.

# డయాలసిస్, మార్చురీ భవన నిర్మాణాలు పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి సింధూరదర్శిని: కనిగిరి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్ మరియు మార్చురీ భవనాలను ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, కాంట్రాక్టర్‌తో కలిసి భవనాల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రాంత ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన సదుపాయాలను కల్పించడంపై చర్చించారు. అలాగే మార్చురీ భవనంలో అవసరమైన మౌలిక వసతులు అంశాలపై వైద్యాధికారి డాక్టర్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగకరంగా, అన్ని అవసరమైన వసతులతో భవనాలను అందుబాటు లోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

# నేడు మదనపల్లెకు సీఎం చంద్రబాబు రాక

## రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

### హాజరుకానున్న కేంద్ర ఆర్థిక మంత్రి

మదనపల్లె సింధూరదర్శిని: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించనున్నారు. ఉదయం ఆయన గుం టూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్ లో బయలుదేరి ఉదయం 10:30 గంటలకు మదనపల్లె మండలం కొండమర్రిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్వాగతం స్వీకరించిన అనంతరం, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 11:00 గంటలకు బి.కె.పల్లి గ్రామంలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా 'రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్'తో పాటు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1:15గంటలకు సభా ప్రాంగణం నుంచి బయలు దేరి కొండమర్రిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకొని, 1:35 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా జిల్లా అధికార యంత్రాం గం పకడ్బందీ ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేసింది.



# పద్మావతి అమ్మవారు గణపయ్యను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు

- తిరుపతి విమానాశ్రయంలో మంత్రికి ఘన స్వాగతం పలికిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి
- ఆలయ పండితుల నుంచి వేద ఆశీర్వచనం స్వీకరణ

తిరుపతి (సింధూరదర్శిని) 1 అక్టోబర్ తిరుపతి జిల్లా; రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి విమానాశ్రయంలో మంత్రి కి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం కుటుంబ సమేతంగా తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితుల నుంచి వేద ఆశీర్వచనం స్వీకరించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించి నట్లు మంత్రి తెలిపారు.



అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఆయన కుటుంబ సభ్యులు స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు.





# పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు( సింధూరదర్శిని)1 అక్టోబర్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండలంలోని చింతవరం గ్రామంలో గురువారం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో గూడూరు నియోజక వర్గ శాసనసభ్యులు డా" పాశం సునీల్ కుమార్ పాల్గొ న్నారు. మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎమ్మెల్యే కు పూలమాలలు, శాలువాలు, మంగళ హారతులతో ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు నాయకులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీచేసి, 15లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మా ణానికి శంకుస్థాపన, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 58లక్షల రూపాయలతో ల్యాబ్ ను ప్రారంభిం చారు. అనంతరం నిర్వహించిన గ్రామసభ కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ...పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అధికా రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప మరేమీ లేదని, ప్రజలు వాటిని గుర్తించి పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే వైసిపి వాటిని జీర్ణించుకోలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తుందని, ప్రజలు మొత్తం గమనిస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, మీ అందరి దయ వల్లే నేను ఎమ్మెల్యేను అయ్యానని, ఏ సమస్య వచ్చినా ఏ టైంలో నైనా నా వద్దకు రావచ్చునని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ కుమారి, తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి , ఎంపీడీవో వెంకటరావు , మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీల కురాలు ప్రసన్న లక్ష్మి, కార్యదర్శి నెల్లటూరు చిరంజీవి,కొమరి సాయిబాబా లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, పెనుబోలు జానకిరామిరెడ్డి, చిట్టేటి నారాయణ, పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, చేవూరు నాగరాజు, సతీష్ యాదవ్, కీరవాణి ,మేకల కుమార్,త్రీ విక్రమ్, దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి,సూలాలయ్య, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం

నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు

వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన

హైదరాబాద్ సింధూరదర్శిని: హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.



### సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

### ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం

ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది.

ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.



చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు.

ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

### వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం

హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

# ఆన్‌లైన్ పార్సిల్ బాక్సులు ఎక్కువగా బ్రౌన్ రంగులోనే ఎందుకుంటాయి?

బాక్స్ తయారయ్యే పదార్థం, ఖర్చు, మన్నికే ప్రధాన కారణం

క్రాఫ్ట్ పేపర్, కరుగేటెడ్ ఫైబర్‌బోర్డుతో పార్సిల్ బాక్సుల తయారీ

తయారీ ప్రక్రియలోనే దానికి సహజంగా గోధుమ రంగు

ప్రత్యేకంగా రంగు వేయాల్సిన అవసరం లేకుండా అదే కలర్ కొనసాగింపు

రుగేటెడ్ బాక్సుల్లో పలు పొరలు వల్ల మన్నిక మరో ప్రయోజనం



ఆన్‌లైన్‌లో ఏదైనా ఆర్డర్ చేశారంటే.. కొన్ని రోజుల్లో మన ఇంటి తలుపు దగ్గరకు ఓ బ్రౌన్ రంగు బాక్స్ వచ్చేస్తుంది. అందులో పుస్తకాలు ఉండొచ్చు.. బట్టలు ఉండొచ్చు.. ఇంట్లో వాడే వస్తువులు ఉండొచ్చు. వస్తువు ఏదైనా ప్యాకింగ్ మాత్రం చాలాసార్లు ఒకేలా కనిపిస్తుంది. అసలు ఈ బాక్సులన్నీ బ్రౌన్ రంగులోనే ఎందుకుంటాయి? తెలుపు, ఎరుపు, నీలం లాంటి రంగుల్లో ఎందుకు ఉండవు? దీని వెనుక పెద్ద రహస్యం ఏమీ లేదు. బాక్స్ తయారయ్యే పదార్థం, ఖర్చు, మన్నిక.. ఇవే ప్రధాన కారణాలు.

### ప్రత్యేకంగా రంగు వేయాల్సిన అవసరం ఉండదు

చాలా షిప్పింగ్ బాక్సులను క్రాఫ్ట్ పేపర్, కరుగేటెడ్ ఫైబర్‌బోర్డుతో తయారు చేస్తారు. వీటికి సహజంగానే లేత గోధుమ లేదా బ్రౌన్ రంగు ఉంటుంది. క్రాఫ్ట్ పేపర్‌ను కలప నుంచి లభించే ఫైబర్లతో తయారు చేస్తారు. తయారీ ప్రక్రియలోనే దానికి ఈ సహజ రంగు వస్తుంది. అంటే సాధారణ పార్సిల్ బాక్స్ బ్రౌన్‌గా కనిపించడానికి ప్రత్యేకంగా బ్రౌన్ రంగు పూయాల్సిన అవసరం ఉండదు.

### ఖర్చు తగ్గుతుంది

బ్రౌన్ బాక్సులు ఎక్కువగా వాడటానికి మరో ముఖ్య కారణం ఖర్చు. తెలుపు లేదా ఇతర రంగుల్లో బాక్సులను తయారు చేయాలంటే అదనపు కోటింగ్, ప్రాసెసింగ్, ప్రింటింగ్ అవసరం కావచ్చు. సాధారణ క్రాఫ్ట్ ప్యాకేజింగ్‌ను మాత్రం పెద్దగా అదనపు ఫినిషింగ్ లేకుండానే ఉపయోగించవచ్చు.

రోజుకు లక్షల పార్సిళ్లు పంపించే ఈ-కామర్స్ సంస్థలకు ఒక్కో బాక్స్‌పై కొద్దిగా అదనపు ఖర్చు వచ్చినా.. మొత్తం మీద అది భారీ మొత్తంగా మారుతుంది. అందుకే తక్కువ ఖర్చుతో లభించే సాధారణ క్రాఫ్ట్ ప్యాకేజింగ్ వారికి ఉపయోగకరంగా ఉంటుంది.

### బలం కూడా ఎక్కువే

బ్రౌన్ బాక్సులకు కేవలం తక్కువ ధర మాత్రమే కారణం కాదు. ఇవి బలంగా ఉండటం కూడా మరో ముఖ్య కారణం. కరుగేటెడ్ బాక్సుల్లో పలు పొరలు ఉంటాయి. మధ్యలో ఉండే అలల మాదిరి పొర బాక్స్‌కు గట్టిదనాన్ని ఇస్తుంది. వస్తువులను తరలించే సమయంలో ఒత్తిడి, చిన్నపాటి దెబ్బల నుంచి రక్షించడంలో ఇది సహాయపడుతుంది.

# శాకాహారులా?.. ప్రోటీన్ లోపం రాకుండా మీ డైట్‌లో ఇవి చేర్చుకోండి!

భారతీయ వంటకాల్లో ప్రోటీన్ అధికంగా లభించే ఆహార పదార్థాలు – పప్పుధాన్యాలు, పనీర్, సోయా ఉత్పత్తులతో సంపూర్ణ పోషణ

ధాన్యాలు, పప్పుల కలయికతో శరీరానికి నాణ్యమైన ప్రోటీన్ – శాకాహారంతో రుచి, ఆరోగ్యం రెండూ సాధ్యమని నిపుణుల సూచన

ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకుంటారు. శాకాహారం వల్ల కలిగే పోషక, పర్యావరణ, నైతిక ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. 1977లో నార్త్ అమెరికన్ వెజిటేరియన్ సొసైటీ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అక్టోబర్ నెల మొత్తం 'శాకాహార అవగాహన మాసం'గా కూడా పాటిస్తారు. ఈ సందర్భంగా, భారతీయ శాకాహార భోజనంలో ప్రోటీన్‌ను సమృద్ధిగా అందించే ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం. భారతదేశంలో శాకాహారం ఒక జీవన విధానం. సరైన ప్రణాళికతో కూడిన శాకాహారం ద్వారా శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను పొందవచ్చు. ముఖ్యంగా ప్రోటీన్ కోసం మాంసాహారంపైనే ఆధారపడాల్సిన అవసరం లేదు. మన వంటింట్లో లభించే పప్పుధాన్యాలు, పాల ఉత్పత్తులు, సోయా, నట్స్, విత్తనాల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. పోషకాహార మార్గదర్శకాల ప్రకారం, ధాన్యాలను (బియ్యం, గోధుమలు) పప్పుధాన్యాలతో కలిపి తీసుకోవడం ద్వారా శరీరానికి సంపూర్ణమైన, నాణ్యమైన ప్రోటీన్ అందుతుంది. మన సంప్రదాయ భోజనమైన పప్పు-అన్నం, రాజ్మా-చావల్ దీనికి చక్కటి ఉదాహరణలు.

### ప్రోటీన్ సమృద్ధిగా లభించే భారతీయ ఆహారాలు:

పప్పు ధాన్యాలు: భారతీయ భోజనంలో పప్పు లేనిదే ముద్ద దిగదు. పెసరపప్పు, కందిపప్పు, మసూర్ దాల్ (ఎర్ర కందిపప్పు) వంటివి సులభంగా జీర్ణమవడమే కాకుండా త్వరగా ఉడుకుతాయి. ఇవి అన్నం, రోటీలతో కలిపి తీసుకున్నప్పుడు మంచి ప్రోటీన్‌ను అందిస్తాయి.

**రాజ్మా, శనగలు:**
రాజ్మా (కిడ్నీ బీన్స్) అన్నంతో కలిపి తీసుకుంటే అద్భుతమైన రుచిని, పోషకాలను అందిస్తుంది. ఇందులో



ప్రోటీన్‌తో పాటు ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. అలాగే శనగలను (జప్త్రశీశ్రీవ) కూరగా, ఉడకబెట్టి లేదా వేయించుకుని స్నాక్స్‌గా తినవచ్చు.

**పనీర్, పాల ఉత్పత్తులు:**
శాకాహారులకు పనీర్ ఒక వరం లాంటిది. ఇందులో ప్రోటీన్‌తో పాటు కాల్షియం కూడా సమృద్ధిగా లభిస్తుంది. పాలక్ పనీర్, పనీర్ భుర్జీ వంటి వంటకాలు రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం అందిస్తాయి. అలాగే పాలు, పెరుగు, మజ్జిగ వంటివి కూడా రోజువారీ ప్రోటీన్ అవసరాలను తీరుస్తాయి.

**సోయా, టోఫు:**
మొక్కల ఆధారిత ప్రోటీన్‌కు సోయాబీన్స్, టోఫు (సోయా పనీర్) అద్భుతమైన ఎంపికలు. వీటిని కూరలు, స్టార్ ఫ్రైలలో ఉపయోగించడం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్‌ను భర్తీ చేయవచ్చు.

ఇతరాలు: వీటితో పాటు పచ్చి బఠాణీలను పులావ్, కూరల్లో వాడటం, మొలకెత్తిన పెసలు, ఇతర పప్పులను సలాడ్లు, చాట్‌లలో చేర్చడం ద్వారా పోషక విలువలను పెంచుకోవచ్చు. తక్కువ ధరలో లభించే వేరుశనగలో ప్రోటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. వీటిని వేయించుకుని లేదా చట్నీల రూపంలో తీసుకోవచ్చు. మొత్తం మీద చూస్తే.. సరైన ప్రణాళికతో కూడిన భారతీయ శాకాహార భోజనం ద్వారా శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను, ముఖ్యంగా ప్రోటీన్‌ను సులభంగా పొందవచ్చు. ఈ ఆహార పదార్థాలను రోజువారీ భోజనంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, దృఢంగా ఉండొచ్చు.

# జీఎస్టీ వసూళ్లలో భారీ జంప్.. సెప్టెంబరులో రూ.2.04 లక్షల కోట్లు

దేశంలో జీఎస్టీ వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. సెప్టెంబరులో స్థూల జీఎస్టీ వసూళు 14.7 శాతం పెరిగి రూ.2,03,521 కోట్లకు చేరాయి. గతేడాది సెప్టెంబరులో రూ.1,77,173 కోట్లుగా ఉన్న వసూళ్లతో పోలిస్తే ఈసారి గణనీయమైన పెరుగుదల నమోదైంది. వరుసగా మూడో నెలలోనూ జీఎస్టీ వసూళు రూ.2 లక్షల కోట్లకు చేరువగా లేదా అంతకుమించి ఉండటం గమనార్హం. సెప్టెంబరులో కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) ద్వారా రూ.37,762 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) ద్వారా రూ.45,363 కోట్లు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1,20,396 కోట్లుగా నమోదయ్యాయి. సెటిల్‌మెంట్ల తర్వాత నికర జీఎస్టీ ఆదాయం 18.1 శాతం పెరిగి రూ.1,76,520




కోట్లకు చేరింది. దేశీయంగా వసూలైన జీఎస్టీ ఆదాయం కూడా పెరిగింది. సెప్టెంబరులో ఇది 10.1 శాతం వృద్ధితో రూ.1,37,996 కోట్లకు చేరింది. దిగుమతులపై వసూలైన జీఎస్టీ ఆదాయం పెరగడం మొత్తం వసూళ్ల వృద్ధికి ప్రధానంగా దోహదం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల్లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12,46,278 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11.6 శాతం వృద్ధి నమోదైంది. అక్టోబర్ 7న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పెద్దగా పన్ను రేట్ల మార్పులు ఉండకపోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. జీఎస్టీ 2.0లో భాగంగా ప్రక్రియల సరళీకరణ, ఈ-ఇన్వాయిసింగ్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. గతంలో అమలు చేసిన పన్ను రేట్ల మార్పులు ఎలా పనిచేస్తున్నాయన్న అంశాన్ని కూడా కౌన్సిల్ సమీక్షించనుంది.

# 60 ఏళ్ల సుబ్బయ్య సూపర్.. 2 లక్షల కి.మీ. సైక్లింగ్‌తో అద్భుతం

**గుంటూరుకు చెందిన సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్య అరుదైన ఘనత - కేవలం ఆరేళ్లలో 2 లక్షల కిలోమీటర్ల సైక్లింగ్ పూర్తి**

**సెప్టెంబర్ 30 నాటికి రికార్డు సాధించిన సుబ్బయ్య - రోజూ 100 కిలోమీటర్ల సైక్లింగ్‌తో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వైనం**

**ఆయనను ఘనంగా సత్కరించిన తోటి సైక్లిస్టులు**



వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సంకల్పం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపిస్తున్నారు గుంటూరుకు చెందిన ప్రముఖ సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్య. సుబ్బయ్య వయసు ప్రస్తుతం 60 ఏళ్లు. ఆయన సాధించిన ఘనత ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏకంగా రెండు లక్షల కిలోమీటర్ల సైకిల్ ప్రయాణాన్ని పూర్తి చేసి, ఈ అరుదైన క్లబ్‌లో చేరిన అతి కొద్దిమందిలో ఒకరిగా నిలిచారు. నిన్న (సెప్టెంబర్ 30) బుధవారం నాటికి సుబ్బయ్య ఈ మైలురాయిని చేరుకున్నారు. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెం అనే చిన్న గ్రామంలో ఓ రైతు కుటుంబంలో సుబ్బయ్య జన్మించారు. కోటయ్య, సామ్రాజ్యమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, ఈయన రెండోవారు. సుబ్బయ్య వృత్తిరీత్యా సివిల్ ఇంజినీర్. ఆయన గుంటూరులో అనేక భవనాలు, ఫ్లాట్లు, వాణిజ్య భవనాల నిర్మాణంలో తన సేవలు అందించారు. సుబ్బయ్య పెద్దన్నయ్య సింగయ్య ఐఆర్ఏఎస్ అధికారిగా రైల్వే శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తించి కొంతకాలం కిందట రిటైరయ్యారు. సుబ్బయ్య తమ్ముడు శ్రీనివాసరావు వ్యవసాయ రంగంలో ఉన్నారు.

ఆశ్చర్యకరంగా, సుబ్బయ్య తన సైక్లింగ్ ప్రస్థానాన్ని



ప్రారంభించింది కేవలం ఆరేళ్ల క్రితమే. కరోనా మహమ్మారి సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధతో సైకిల్ తొక్కడం మొదలుపెట్టిన ఆయన, అనతికాలంలోనే దానిని తన జీవితంలో అంతర్భాగంగా మార్చుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు వరకు విరామం లేకుండా సుమారు 100 కిలోమీటర్లు తగ్గకుండా సైక్లింగ్ చేయడం ఆయన దినచర్య. ఇప్పటివరకు 1,623 సెంచరీ రైడ్లతో, 355 హాఫ్ సెంచరీ రైడ్లతో రెండు లక్షల కిలోమీటర్ల మైలురాయిని అందుకున్నారు.

సుబ్బయ్య ప్రయాణం కేవలం గుంటూరు నగర వీధులకే పరిమితం కాలేదు. ఆయన తన సైకిల్‌పై దేశంలోని పలు ప్రాంతాలను చుట్టివచ్చారు. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు' సాగించిన యాత్రతో సహా మొత్తం 15 సుదీర్ఘ రైడ్‌లను విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన ఆల్-టైమ్ గణాంకాలను పరిశీలిస్తే, మొత్తం 2,268 రైడ్‌లలో ఈ అద్భుతమైన దూరాన్ని అధిగమించారు. ఒకసారి ఏకధాటిగా 1,058 కిలోమీటర్ల వరకు ప్రయాణించి తన శారీరక, మానసిక దృఢత్వాన్ని చాటుకున్నారు.

ఈ అద్భుత విజయాన్ని పురస్కరించుకుని గుంటూరులోని విద్యానగర్ ఎక్స్‌టెన్షన్‌లో డాక్టర్ పోసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో తోటి సైక్లిస్టులు సుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ, "నిరంతర సాధన, క్రమశిక్షణతో సైక్లింగ్‌ను నా జీవితంలో భాగం చేసుకున్నాను. దాని ఫలితమే ఈ రికార్డు" అని వినమ్రంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్. వెంకటరావు, విజయ్, అనిల్, డాక్టర్ రంజిత్, డాక్టర్ సీతారామ్, మాదల శ్రీనివాస్ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని సుబ్బయ్యను అభినందించారు. పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా అద్భుతాలు చేయవచ్చని నిరూపించిన సుబ్బయ్య, నేటి యువతకు స్ఫూర్తిదాతగా నిలుస్తున్నారు.

అన్నట్టు.. సుబ్బయ్య మాస్టర్స్ కేటగిరీలో మంచి స్విమ్మర్ కూడా. హైస్కూల్ స్థాయిలో స్పోర్ట్స్ మన్ అయిన ఆయన, వివాహం తర్వాత క్రీడలకు దూరయ్యారు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ క్రీడలవైపు మళ్లారు. ఈసారి ఆయన ఎంచుకున్నది స్విమ్మింగ్. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజి వద్ద రోజుకు రెండు కిలోమీటర్ల మేర స్విమ్మింగ్ సాధన చేసి అందులో నైపుణ్యం సాధించారు. ఆయన స్విమ్మింగ్ ప్రయాణంలో కృష్ణా నదిలో చేసిన విన్యాసాలు ఒక ప్రత్యేక అధ్యాయం. విజయవాడ ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఏటా నిర్వహించే కృష్ణా నది ఈత పోటీల్లో పాల్గొన్నారు. తొలి ప్రయత్నంలో ఓటమి తర్వాత కఠోరంగా శ్రమించారు. ఆ తర్వాత నిర్వహించిన పోటీల్లో ఆయన మొదటి రెండు స్థానాల్లో ఉండేవారు. అయితే విజేత, లేకపోతే రెండో స్థానం... ఇలా సాగింది సుబ్బయ్య స్విమ్మింగ్ ప్రస్థానం. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పాల్గొని, తొలి ప్రయత్నంలోనే ఆరో స్థానం సాధించారు. సుమారు 20 ఏళ్ల పాటు స్విమ్మింగ్‌లో కొనసాగి, వివిధ వయసుల కేటగిరీలలో జాతీయ స్థాయి వరకు ఎన్నో పతకాలు సాధించారు. అనంతరం కరోనా సమయంలో సైక్లింగ్ ను ఎంచుకుని అందులోనూ తనదైన ముద్ర వేశారు. ఇప్పుడు 2 లక్షల కి.మీ సైక్లింగ్ తో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే.. వ్యక్తిగత ఘనతలు, మైలురాళ్ల కంటే ఫిట్ నెస్, ఆరోగ్యం కోసం సైక్లింగ్ క్రీడకు యువతలో విస్తృత ప్రాచుర్యం కల్పించాలన్నదే ఆయన ఆలోచన.



# టీమిండియాకు ఎదురుదెబ్బ.. మూడో వన్డేకు ప్రసిద్ధ్ కృష్ణ దూరం.. యువ పేసర్‌కు చాన్స్!

**వెస్టిండీస్‌తో రెండో వన్డేలో తొడ కండరాల గాయంతో మైదానం వీడిన ప్రసిద్ధ్**

**అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌కు జట్టులో చోటు**

**పరీక్షల కోసం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్‌కు వెళ్లనున్న ప్రసిద్ధ్**

**న్యూజిలాండ్ పర్యటనకు ప్రసిద్ధ్ లభ్యతపై నెలకొన్న ఆందోళన**



వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఉన్న భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కీలక పేస్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) కారణంగా మూడో వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. గువహటి వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ అసౌకర్యంగా కనిపించాడు. తన తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతను, 31వ ఓవర్ వేసిన తర్వాత మైదానం వీడాడు. మొత్తం మీద కేవలం ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడంతో, అతని స్థానంలో జట్టు యాజమాన్యం పార్ట్ టైమ్ బౌలర్ నమన్ ధిర్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది. గాయం తీవ్రతను అంచనా వేసేందుకు ప్రసిద్ధ్ కృష్ణను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపనున్నారు. అక్కడ జరిపే స్కాన్‌ల ఆధారంగా అతను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై స్పష్టత రానుంది. "ప్రసిద్ధ్ మూడో వన్డే ఆడటం లేదు. తదుపరి పరీక్షల కోసం అతను బెంగళూరు వెళతాడు. ప్రస్తుతానికి అతని స్థానంలో కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది" అని బీసీసీఐ వర్గాలు గురువారం ఓ వార్తా సంస్థకు తెలిపాయి. అన్షుల్ కంబోజ్‌ను, ప్రస్తుతం పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్ నుంచి బీసీసీఐ వెనక్కి పిలిపించింది. ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు తీసిన కంబోజ్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం రెండు ఓవర్లు వేసిన అనంతరం, అతడికి తాజా సమాచారం అందించారు. దాంతో అతడు భారత జట్టుతో చేరేందుకు బయలుదేరాడు.

ప్రసిద్ధ్ గాయం కేవలం ఈ సిరీస్‌కే కాకుండా, త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనపైనా ఆందోళన కలిగిస్తోంది. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఉన్న నేపథ్యంలో ప్రసిద్ధ్ వంటి కీలక బౌలర్ లభ్యత జట్టుకు చాలా ముఖ్యం. మూడో వన్డేలో ప్రసిద్ధ్ లేకపోవడంతో, ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లలో బెంచ్‌కే పరిమితమైన సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు లేదా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది.




# సెప్టెంబర్‌లోనూ ఆగని యూపీఐ హవా..

**24 బిలియన్ల లావాదేవీలతో రికార్డు**

**లావాదేవీల విలువ రూ.29.37 లక్షల కోట్లుగా నమోదు**

**ఆర్థిక మంత్రితో భేటీ తర్వాత నిరసన విరమించుకున్న వ్యాపారులు**

**'నో యూపీఐ డే' పిలుపును ఉపసంహరించుకున్న వర్తక సంఘాలు**

**రూ.2,000 లోపు చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు లేవని ప్రభుత్వ స్పష్టీకరణ**

దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి ప్రతీకగా నిలుస్తున్న 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యూపీఐ) తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. సెప్టెంబర్ నెలలో కూడా యూపీఐ లావాదేవీలు భారీగా నమోదయ్యాయి. మరోవైపు, మర్చంట్ లావాదేవీలపై ఛార్జీల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నిరసనకు పిలుపునిచ్చిన వ్యాపార సంఘాలు, కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ తర్వాత తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయి.

'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 23 శాతం పెరిగి 24.07 బిలియన్లకు చేరుకుంది. ఇక, లావాదేవీల విలువ 18 శాతం వృద్ధితో రూ. 29.37 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే.. సెప్టెంబర్‌లో ప్రతిరోజూ సగటున 802 మిలియన్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ సుమారు రూ. 97,913 కోట్లుగా ఉంది. ఆగస్టు నెలలో నమోదైన 24.51 బిలియన్ల లావాదేవీలతో పోలిస్తే సెప్టెంబర్‌లో స్వల్ప తగ్గుదల కనిపించినా, వార్షిక వృద్ధి మాత్రం బలంగా కొనసాగుతోంది. ఇదే సమయంలో ఐఎంపీఎస్ ద్వారా జరిగిన లావాదేవీల విలువ కూడా 18 శాతం పెరిగి రూ. 7.06 లక్షల కోట్లకు చేరింది.

### నిరసన విరమణ.. ప్రభుత్వ స్పష్టత

ఇదిలా ఉంటే.. రూ. 2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) విధించాలన్న ప్రతిపాదనను వ్యాపార వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నిర్ణయం చిన్న, మధ్య తరహా వ్యాపారులపై భారం మోపుతుందని, డిజిటల్ చెల్లింపుల స్వీకరణను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. దీనికి నిరసనగా అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) సహా పలు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో చాందినీ చౌక్ ఎంపీ, సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ నేతృత్వంలోని సుమారు 20 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైంది. ఈ భేటీ తర్వాత వ్యాపార సంఘాలు తమ నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి.

ప్రభుత్వం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ కొత్త ఛార్జీల విధానం కేవలం రూ. 2,000 మించిన మర్చంట్ (పీ2పీ) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీలలో 96 శాతానికి పైగా రూ. 2,000 లోపే ఉంటున్నాయని, కాబట్టి అత్యధిక శాతం లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని వివరించింది. అంతేకాకుండా, నెలవారీగా రూ. 1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. ఇక వ్యక్తి నుంచి వ్యక్తికి (పీ2పీ) జరిపే లావాదేవీలు ఎంతటి విలువైనవైనా పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని పునరుద్ఘాటించింది. ప్రభుత్వ హామీలతో వ్యాపారుల ఆందోళనలు ప్రస్తుతానికి సద్దుమణిగాయి.

# కొండేపిలో పేదల సొంతింటి కల సాకారం...

**- నియోజకవర్గానికి 229 ఇళ్లు మంజూరు**

**- లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

కొండేపి సింధూరదర్శిని: కొండేపి మండల పరిధిలో ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు గృహ నిర్మాణ అనుమతి, మంజూరు పత్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శోధనాత్మకంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండేపి నియోజకవర్గంలో పిఎంఎవై ఒడా 2.0 పథకం కింద మొత్తం 229 నూతన గృహాలు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో గ్రామాల వారీగా కొండేపి గ్రామానికి 68, పొన్నలూరు మండలం వేంపాడు గ్రామానికి 11, సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి 24 మరియు పాకల గ్రామానికి 45, టంగుటూరు మండలం టంగుటూరు గ్రామానికి 54, అలాగే జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట గ్రామానికి 27 గృహాలు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. మిగిలిన గ్రామాల్లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ రాబోయే 10 రోజుల్లో మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తూ ఒక్కో గృహానికి యూనిట్ ఖర్చు రూ 2,50,000 (పూర్తి సబ్సిడీ) అని, ఇందులో కేంద్ర ప్రభుత్వం సహాయం రూ 1,50,000 (60%), రాష్ట్ర ప్రభుత్వం సహాయం రూ 1,00,000 (40%)గా ఉందని తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ రాబోయే రోజుల్లో పూర్తి చేసి, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పి. శ్రీనివాస ప్రసాద్, డి.ఈ సత్యనారాయణ, తహసిల్దార్ శ్రీనివాసరావు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్





## వెంకీ 'ఆదర్శ కుటుంబం'.. ట్రైలర్, బుకింగ్స్‌పై కీలక ప్రకటన!

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతూ చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో ముందుకొస్తోంది. సినిమా విడుదల తేదీ అక్టోబర్ 9 సమీపిస్తుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచి ంది. తాజాగా నిర్మాత నాగవంశీ ఈ సినిమా ట్రైలర్ విడుదల, టికెట్ బుకింగ్స్‌కు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. నాగవంశీ తెలిపిన వివరాల ప్రకారం.. 'ఆదర్శ కుటుంబం' థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 6వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరగ్గా, ట్రైలర్‌తో కథాంశం, పాత్రల తీరుతెన్నులపై పూర్తి స్పష్టత రానుంది. ముఖ్యంగా తొలిసారి వెంకటేశ్‌ను త్రివిక్రమ్ ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ట్రైలర్ విడుదలైన మరుసటి రోజే, అంటే అక్టోబర్ 7 నుంచి తెలుగు రాష్ట్రాల్లో టికెట్ బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో అభిమానులు, ప్రేక్షకులు సినిమా విడుదలకు రెండు రోజుల ముందే తమ టికెట్లను రిజర్వ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ.. 'ఆదర్శ కుటుంబం' ఒక సంపూర్ణ కుటుంబ కథా చిత్రమని, కామెడీ, యాక్షన్, భావోద్వేగాల కలబోతగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. "పిల్లల పరీక్షలు పూర్తయ్యాక, కుటుంబ మంతా కలిసి థియేటర్‌కు వచ్చి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆస్వాదిస్తారు" అని ఆయన పేర్కొన్నారు. త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, ఆయన శైలి మేకింగ్‌కు వెంకటేశ్ ఎనర్జీ, టైమింగ్ తోడైతే వినోదం ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రేక్ష కులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తు ండగా, నివేదా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేశ్, సత్య, యువినా పార్తవి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 9న థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై తాజా అప్‌డేట్స్‌తో అంచ నాలు మరింతగా పెరిగాయి.

## ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదు..

'ది ప్యారడైజ్' రిజల్ట్‌పై నాని ఆసక్తికర వ్యాఖ్యలు

ప్యారడైజ్ సినిమాపై భిన్న స్పందనలు

తన 33 సినిమాల్లో ఇలాంటి స్పందన తొలిసారన్న నాని

తీవ్ర విమర్శలను కూడా సానుకూలంగానే తీసుకున్నామని వెల్లడి

ఇంత భిన్న స్పందన ఊహించలేదన్న నాని

స్పందనను ఇంకా అర్థం చేసుకుంటున్నానన్న శ్రీకాంత్ ఓదెల



నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్'కు ప్రేక్షకుల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. సినిమా నచ్చిందని కొందరు చెబుతుండగా.. మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాని స్పందించారు. తన 18 ఏళ్ల కెరీర్‌లో 33 సినిమాలు చేసినా.. ఇలాంటి భిన్నమైన స్పందనను తొలిసారి చూస్తున్నానని చెప్పారు. సినిమాపై విమర్శలు వచ్చినా వాటిలో కనిపిస్తున్న తీవ్రతను తాము సానుకూలంగానే తీసుకున్నామని నాని తెలిపారు. సినిమా నచ్చలేదని ఎవరైనా బలంగా చెబితే.. అది కూడా ప్రేక్షకుల స్పందనేనని పేర్కొన్నారు.

'ది ప్యారడైజ్'కు తీవ్ర స్థాయిలో స్పందనలు రావొచ్చని ముందే తెలుసని నాని చెప్పారు. అయితే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదన్నారు. ఇది తనకు ఒక కొత్త అనుభవమని చెప్పారు. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా స్పందించారు. సినిమాకు వస్తున్న మిశ్రమ స్పందనను ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నానని తెలిపారు. మరికొంత సమయం తీసుకుని ప్రేక్షకుల స్పందనను అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. ఇదే విషయంపై నాని, సినిమా విడుదలైన మరుసటి రోజే సోషల్ మీడియాలో స్పందించారు. ప్రేక్షకుల ప్రేమతో పాటు, ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నానని చెప్పారు. సినిమా బాగోలేదని విమర్శకులు చెప్పిన అంశాల నుంచి కూడా నేర్చుకున్నానని తెలిపారు. ప్రేక్షకుల కోసం ఎంతో కష్టపడి ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు సినిమా చేశామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 24న విడుదలైన 'ది ప్యారడైజ్'లో మోహన్ బాబు, కయాదు లోహర్, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది.

## ఆయనలా బాధపడితే 500 సార్లు ఆత్మహత్య చేసుకునేవాడిని: బండ్ల గణేశ్

'తెల్ల కాగితం' ప్రీరిలీజ్ వేడుకకు హాజరైన బండ్ల గణేశ్ – దర్శకుడి కష్టాలపై తనదైన శైలిలో స్పందన

విమర్శలను పట్టించుకుంటే 500 సార్లు ఆత్మహత్య చేసుకునేవాడినని వ్యాఖ్య

నిర్మాత కృష్ణ కొమ్మాలపాటి మనసు తెల్ల కాగితం వంటిదన్న బండ్ల

అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానున్న 'తెల్ల కాగితం'




హర్ష్ రోషన్ హీరోగా, నక్షత్ర హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'తెల్ల కాగితం'. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వంలో, అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ యూత్‌ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 2న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. వేడుకలో దర్శకుడు రమేశ్ బండ్రెడ్డి తన ప్రయాణంలో ఎదురైన కష్టాల గురించి ప్రస్తావించగా, బండ్ల గణేశ్ దానిపై స్పందించారు. "డైరెక్టర్ రమేశ్ బాధ పడ్డానని, అమ్మను తీసుకొచ్చానని, దుఃఖ పడ్డానని అంటున్నాడు. ఆయనలాగా నేను బాధపడితే ఇప్పటికి 500 సార్లు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చేది. ఎందుకంటే నా గురించి రోజూ ఏదో ఒకటి రాస్తారు. జీవితంలో పక్కోడి గురించి ఆలోచిస్తే, నేను షాద్‌నగర్‌లో కూడా ఉండేవాడిని కాదు. మనం మన గురించే ఆలోచించుకోవాలి, ఎదగడానికి ప్రయత్నించాలి. పక్కోడు మన గురించి ఏడవాలి, తిట్టాలి, మనం మాత్రం పైకి చేరుకోవాలి" అంటూ తనదైన మార్క్



ప్రసంగంతో అందరినీ ఉత్తేజపరిచారు. అనంతరం నిర్మాత కృష్ణ కొమ్మాలపాటితో తనకున్న స్నేహాన్ని బండ్ల గణేశ్ గుర్తుచేసుకున్నారు. "నిర్మాత కృష్ణ అన్న మనసు ఒక తెల్ల కాగితం. ఎంతోమంది ఆయనతో పనిచేయించుకుని వదిలేశారు. ఆయన జీవితం వైకుంఠపాళిలా సాగింది. నిచ్చెన ఎక్కుతుంటే పాము కరిచింది. కానీ ఈసారి మాత్రం ఆయన పెద్ద నిచ్చెన ఎక్కి గోల్ కొడతారని నమ్ముతున్నాను" అని అన్నారు. కృష్ణ తన వ్యాపారాన్ని, కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి కేవలం సినిమా, స్నేహితుల కోసమే జీవిస్తున్నారని, ఆయన త్యాగం గొప్పదని కొనియాడారు. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న హర్ష్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'తెల్ల కాగితం' అక్టోబర్ 2న థియేటర్లలోకి రానుంది.



## ఈ ఫ్రైడే రిలీజ్ అవుతున్న ఎనిమిది సినిమాలు ఇవే!

నేడు థియేటర్ల దగ్గర కనిపించనున్న సందడి

ఫహాద్ ఫాజిల్ తెలుగు సినిమాపై బజ్

భారీస్థాయిలో రిలీజ్ అవుతున్న 'సిగ్మా'

ఈ శుక్రవారం థియేటర్ల దగ్గర కాస్త గట్టిగానే సందడి కనిపించేలా ఉంది. సాధారణంగా ఫ్రైడే వస్తే ఒకటి రెండు పెద్ద సినిమాలు రిలీజ్ అవుతూ ఉంటాయి. లేదంటే రెండు మూడు చిన్న సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తుంటాయి. అయితే ఈ శుక్రవారం 8 సినిమాల వరకూ థియేటర్లలో దిగిపోవడానికి సిద్ధమయ్యాయి. వాటిలో ఒకటిగా 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కనిపిస్తోంది. ఆర్కా మీడియా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ లీడ్ రోల్ చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ ఒక రేంజ్ లో ఉండటంతో, సహజంగానే ఆడియన్స్ లో అంచనాలు ఉన్నాయి. సందీప్ కిషన్ 'సిగ్మా' కూడా రేపు భారీస్థాయిలో విడుదలవుతోంది. హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, ఫరియా అబ్దుల్లా కథానాయికగా అలరించనుంది. తమన్ సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలవనుందనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇక హర్ష్ రోషన్ – నక్షత్ర జంటగా నటించిన లవ్ స్టోరీగా 'తెల్లకాగితం' రూపొందిన సంగతి తెలిసిందే. కృష్ణ కొమ్మలపాటి నిర్మించిన ఈ సినిమాకి 'నందు' దర్శకత్వం వహించాడు. యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన సినిమా ఇది. ఈ శుక్రవారం రోజునే 'అనకాపల్లి' సినిమా కూడా ఆడియన్స్ ను పలకరించనుంది. విక్రమ్ సహదేవ్ – సంధ్య – తారక్ పొన్నప్ప ప్రధానమైన పాత్రలను పోషించారు. ఆది పినిశెట్టి హీరోగా నిర్మితమైన 'ఎస్ ఐ యుగంధర్' కూడా డిఫ్ రోజున థియేటర్లకు రానుంది. యశ్వంత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కథానాయికగా మేఘలేఖ అలరించనుంది. ఇక 'సిగ్మా'తో పాటు మరికొన్ని అనువాద చిత్రాలు రేపటి సినిమాల జాబితాలో ఉన్నాయి. ఆ వరుసలోనే 'డోరతి' .. 'ప్రేమనే ఊరిలో' .. 'దృశ్యం ది కంక్లూజన్' కనిపిస్తున్నాయి. ఈ సినిమాలలో దేనికి ఆడియన్స్ వైపు నుంచి ఎక్కువ మార్కులు దక్కుతాయనేది చూడాలి మరి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662